నిద్రపోతున్న నిఘానేత్రం

- పల్లెల్లో అలంకారప్రాయంగా సీసీ కెమెరాలు
- పట్టించుకోని పోలీసులు



పనిచేయని సీసీ కెమెరాల ఎల్ఈడీ టీవీ



బోర్లం గాంధీకూడలిలో అలంకారప్రాయంగా సీసీ కెమెరాలు

బాన్సువాడ రూరల్: ఒక్క సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానమని అంటుంటారు. అటువంటి సీసీ కెమెరాలు బాన్సువాడ మండలంలోని దాదాపు అన్ని గ్రామాల్లో పనిచేయడం లేదు. దీంతో ప్రజల భద్రత ప్రశ్నార్థకంగా మారింది. గ్రామాల్లో అసాంఘిక కార్యక్రమాలు, చోరీలు పెరిగాయి. ఐదారేళ్ల క్రితం పోలీసుశాఖ వారు ప్రత్యేక చొరవ తీసుకుని నాటి సర్పంచ్‌లను, ప్రజాప్రతినిధులను, గ్రామపెద్దలు, దాతలను ప్రోత్సహించి రూ.లక్షలు వెచ్చించి ఊరూరా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించారు. ఆరంభ శూరత్వంగా కొన్ని నెలలపాటు బాగానే కొనసాగినా ప్రస్తుతం అవి ఎక్కడా పని చేయకపోయినా పట్టించుకునే నాథుడు కరువయ్యాడు. గ్రామాల్లో సీసీ కెమెరాలు ఉండగా తగ్గుముఖం పట్టిన నేరాల సంఖ్య ప్రస్తుతం అవి పనిచేయకపోవడంతో పెరిగాయి. రోడ్డుప్రమాదాలు, బైకులు, ఇతర చోరీలు, గొడవలు, ఇతర ఘటనలు జరిగినప్పుడు వాటిని ఛేదించడం పోలీసులకు సవాలుగా మారుతోంది.

మేజర్ గ్రామాలు, మారుమూల తండాల్లోనూ..

బాన్సువాడ పట్టణం మినహా మండలంలోని ఏ ఒక్క గ్రామాలోనూ సీసీ కెమెరాలు పూర్తి స్థాయిలో పనిచేయడం లేదు. మండలంలోని బోర్లం గ్రామంలో 6 కెమెరాలు, కోనాపూర్‌లో 5 కెమెరాలు, కాద్లాపూర్‌లో 3 కెమెరాలు, సోమేశ్వర్, హన్మాజీపేట్ గ్రామాల్లో 4 చొప్పన కెమెరాలు ఉన్నా వాటిలో ఏ ఒక్కటీ పని చేయడం లేదు. పంచాయతీల్లో సర్పంచ్‌లు కొనసాగిన తరుణంలో వాటికి చిన్నచిన్న మరమ్మతులు చేయించారు. ప్రస్తుతం పంచాయతీల్లో నిధులు లేకపోవడంతో పంచాయతీ కార్యదర్శులు వాటి నిర్వహణ మరిచారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి గ్రామాల్లో ప్రస్తుతం ఉన్న సీసీ కెమెరాలను ఉపయోగంలోకి తేవడంతో పాటు మరిన్ని కెమెరాలు ఏర్పాటు చేసి ప్రజల్లో భద్రత పట్ల నమ్మకం కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

త్వరలో ఉపయోగంలోకి తెస్తాం..



గ్రామాల్లో సీసీ కెమెరాలు పాడైపోయిన విషయం వాస్తవమే. వాటి మరమ్మతులకు ప్రత్యేకంగా నిధులేమీ లేవు. గ్రామపెద్దలు, దాతలతో మాట్లాడుతున్నాం. అతి త్వరలోనే కెమెరాలను ఉపయోగంలోకి తెస్తాం.

– మండల అశోక్, సీఐ, బాన్సువాడ

నేటి చిత్రం

కాలువల్లో పేరుకుపోతున్న మురికి



భిక్కనూరు: పెద్దమల్లారెడ్డిలోని నాలుగో వార్డులో మురికి కాలువ చెత్తాచెదారంతో నిండి ఉంది. మురికి ముందుకు కదలడం లేదు. ఈ విషయమై పలుమార్లు గ్రామపంచాయతీ అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదు. ఈ వార్డులో నివసిస్తున్న ప్రజలు కొందరు తీవ్ర జ్వరాలతో బాధపడుతున్నారు. వెంటనే పారిశుద్ధ్య పనులు చేపట్టాలి.

–రవి పెద్దమల్లారెడ్డి, భిక్కనూరు మండలం

మాకు ఫొటో పంపండి

మీ ప్రాంతంలో నెలకొన్న సమస్యను, ఫొటోను మాకు వాట్సాప్‌లో పంపించండి. ప్రచురించి అధికారుల దృష్టికి తీసుకెళ్తాము. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాము.

కామారెడ్డి : 94942 60200 | ఎల్లారెడ్డి : 97053 46576 | బాన్సువాడ : 94402 11363 | జుక్కల్ : 97053 46578

పారిశుద్ధ్యమా నీ జాడెక్కడ..?



మల్లుపేట్‌లో అధ్వానంగా ఉన్న మురికి కాలువ



రక్షిత మంచి నీటి ట్యాంక్ గేట్‌వాల్వ్ వద్ద పరిస్థితి..

- గ్రామాల్లో పేరుకుపోతున్న మురికి
- కొరవడిన అధికారుల పర్యవేక్షణ

సదాశివనగర్(ఎల్లారెడ్డి): అసలే రోగాల సీజన్... వ్యాధులు రాకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఓ పక్క ప్రచారాలు చేస్తున్నారు. కానీ మండలంలోని మల్లుపేట్, కల్వరాల్ గ్రామాల్లో పారిశుద్ధ్యలోపం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. గ్రామాల్లో డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైంది. కాలువల్లో మురికిని ఎప్పటికప్పుడు తొలగించకపోవడంతో పేరుకుపోతోంది. మురికి రోడ్లపై పారుతుంది. గ్రామాలకు కేటాయించిన ప్రత్యేకాధికారులు పర్యవేక్షించకపోవడంతో పాటు పంచాయతీ కార్యదర్శులు దృష్టి సారించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. మండల స్థాయి అధికారులు గ్రామాలను సందర్శించి ఎప్పటికప్పుడు సమస్యలను పరిష్కరించినట్లయితే ఇలాంటి పరిస్థితి ఉండదని ప్రజలు పేర్కొంటున్నారు.

లీకేజీలపై దృష్టి పెట్టాలి...

మల్లుపేట్‌లో వారం రోజుల క్రింద తాగునీటి పైప్ లైన్ లీకేజీ అవుతోంది. వెంటనే మరమ్మతులు చేయించాలి. నిర్లక్ష్యం వహిస్తే వర్షపునీరు పైప్‌లైన్ లోకి వెళ్లి నీరు కలుషితమయ్యే ప్రమాదం ఉంది. రక్షిత మంచి నీటి ట్యాంక్‌ల వద్ద పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి. మండల స్థాయి అధికారులు దృష్టి సారించి సమస్యలను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

క్లుప్తంగా

చికిత్సకు ఆర్థిక సాయం



బాన్సువాడ రూరల్: పులికుచ్చ తండాకు చెందిన వసంత్ నాయక్ కుమార్తె అనారోగ్యంతో హైద్రాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. దీంతో మిత్రుడి ఆర్థిక పరిస్థితిని గమనించిన వసంత్ నాయక్ స్నేహితులు గ్రూప్ ఆఫ్ హెల్పింగ్ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో ఆస్పత్రి ఖర్చుల కోసం తమ వంతుగా రూ.15 వేలు ఆర్థిక సాయం అందించారు. తమ స్నేహితులు, సన్నిహితులు, బంధుమిత్రులు ఆపదలో, ఆస్పత్రుల్లో ఉన్న సమయంలో ప్రతి ఒక్కరం మానవతా దృక్పథంతో ఆలోచించి తోచినంత సాయం అందిస్తున్నట్లు సురేష్, తార్య, అశోక్, దేవిసింగ్, శ్రీకాంత్‌లు తెలిపారు.

బాధ్యతల స్వీకరణ



పిట్లం(జుక్కల్): మండల కేంద్రంలోని స్త్రీ శక్తి భవనంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో నిర్మల్ జిల్లా నుంచి బదిలీపై వచ్చిన సృజన్ కుమార్ రెడ్డి పిట్లం ఏపీఎంగా బాధ్యతలు చేపట్టారు. పిట్లం ఏపీఎంగా విధులు నిర్వహించిన శిరీష.. బీర్కూర్ మండలానికి బదిలీ అయ్యారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన సృజన్ కుమార్ రెడ్డికి సిబ్బంది స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు.

జీపీ రికార్డుల తనిఖీ



లింగంపేట(ఎల్లారెడ్డి): బోనాల్, ముస్తాపూర్ గ్రామాల్లోని గ్రామ పంచాయతీ రికార్డులను సోమవారం ఎంపీవో మలహరి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వ్యక్తిగత పరిశుభ్రత, ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉండేలా గ్రామస్తులకు ఇంటింటికి తిరిగి అవగాహన కల్పించారు. ఏఈలు రజినీకాంత్, సుచిత్ర, కార్యదర్శులు సుబ్బారావు, రమేశ్ తదితరులు ఉన్నారు.

ఉత్తమ విద్యార్థినికి నగదు పురస్కారం

దోమకొండ: స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో గత ఏడాది పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో మొదటి ర్యాంకు సాధించిన సన్వితను సోమవారం పాఠశాల అధ్యాపకులు సన్మానించారు. విశ్రాంత ఉపాధ్యాయులు మొహిన్, వారి సతీమణి జ్ఞాపకార్థం రూ.5 వేల నగదును విద్యార్థి సన్వితకు అందజేశారు. హెచ్‌ఎం శరత్ కుమార్, వెంకటేశ్వర శర్మ, పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు పన్యాల శ్రీనివాస్‌రెడ్డి, హెచ్‌ఎం రాజేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ అభినందనలు



పిట్లం(జుక్కల్): కోల్‌కతాలో గత నెల జరిగిన ఇండియన్ ఓపెన్ ఇంటర్నేషనల్ చెస్ బాక్సింగ్ ఛాంపియన్ షిప్, ఏషియన్ చెస్ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలలో పిట్లంకు చెందిన ప్రతిభ 6 బంగారు పతకాలు సాధించారు. అదేవిధంగా సెర్బియాలోని జరుగబోయే ప్రపంచ చెస్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌కు ఎంపికయ్యారు. ఈ విషయాన్ని తెలుసుకున్న ఎంపీ సురేష్ షెట్కార్ సోమవారం ప్రతిభను నారాయఖేడ్‌లోని తన కార్యాలయానికి ఆహ్వానించి సన్మానించారు. అభినందనలు తెలిపారు.

సీపీఐ జిల్లా మహాసభను విజయవంతం చేయాలి

కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలో ఈనెల 6న జరిగే సీపీఐ మూడవ జిల్లా మహాసభను విజయవంతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు కంజర భూమన్న తెలిపారు. సోమవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. పట్టణంలోని వీక్లీమార్కెట్ మున్నూరుకాపు సంఘ భవనంలో ఈ మహాసభ జరుగుతుందన్నారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, జాతీయ కార్యవర్గసభ్యురాలు పశ్య పద్మతో పాటు రాష్ట్ర నాయకులు హాజరవుతున్నట్లు వివరించారు.

ఇంటింటి నల్లాల సర్వే

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని నాగిరెడ్డిపేటలో సోమవారం మిషన్ భగీరథ అధికారులు ఇంటింటి నల్లాల సర్వే చేపట్టారు. మిషన్ భగీరథ డీఈఈ ప్రవీణ్‌రెడ్డి ఆధ్వర్యంలో గ్రామంలో ఇంటింటికి వెళ్లి నల్లాల పరిస్థితిపై వివరాలు సేకరించారు. మిషన్ భగీరథ ఏఈ రాజ్‌కుమార్, జీపీ కార్యదర్శి కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి ప్రభుత్వం పెద్ద పీట

ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు



దోంగ్లీలో విద్యార్థికి బూట్లు వేస్తున్న ఎమ్మెల్యే

మద్నూర్(జుక్కల్): విద్యాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు అన్నారు. డోంగ్లీ మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు బూట్లు పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. జుక్కల్‌ను ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దుతానన్న మాట ప్రకారం నియోజకవర్గానికి కొత్త స్కూల్స్ తెచ్చానన్నారు. మారుమూల గ్రామాల్లో సైతం ప్రతి విద్యార్థి చదువుకునే విధంగా పాఠశాలల్లో సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. విద్యార్థులకు బూట్లను విరాళంగా అందించిన శివరాజ్‌పటేల్‌ను ఎమ్మెల్యే అభినందించారు. అనంతరం తహసీల్ కార్యాలయంలో నూతన రేషన్ కార్డుదారులకు మంజూరు పత్రాలను పంపిణీ చేశారు.

విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలి

ప్రభుత్వ మాజీ విప్ గంప గోవర్ధన్



డైనింగ్ హాల్‌ను పరిశీలిస్తున్న గంప గోవర్ధన్

భిక్కనూరు: విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని ప్రభుత్వ మాజీ విప్, కామారెడ్డి మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ అన్నారు. సోమవారం ఆయన బస్వాపూర్ ప్రభుత్వ పాఠశాలను సందర్శించి మాట్లాడారు. తన హయాంలో గత ప్రభుత్వంలోనే ప్రభుత్వ ఉన్నత పాఠశాల నిర్మాణానికి విద్యార్థులకు అవసరమైన సౌకర్యాల నిమిత్తం నిధులు మంజూరు చేశామన్నారు. పాఠశాల భవనం నిర్మాణం పూర్తయినా డైనింగ్ హాల్‌లో ఫ్యాన్లు, విద్యుత్ బల్బులు ఏర్పాటు చేయకపోవడం, బాత్రూంలు శుభ్రంగా లేకపోవడంపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. పాఠశాల ఆవరణలో గడ్డి విపరీతంగా పెరిగిందని క్రిమి కీటకాలు సంచరించే అవకాశం ఉందని వెంటనే శుభ్రం చేయాలని పంచాయతీ కార్యదర్శి దయానంద్‌కు సూచించారు. హెచ్‌ఎం సబితారాణికి సూచనలు చేశారు. బీఆర్‌ఎస్ నేతలు బుర్రి గోపాల్, అంద్యాల రమేశ్, దయాకర్, స్వామి, తదితరులు పాల్గొన్నారు.

పోచారం ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేయండి



తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న రైతు నేత బొల్లు నర్సింహారెడ్డి, రైతులు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): పోచారం ప్రాజెక్టు నుంచి ఆయకట్టుకు వెంటనే నీటిని విడుదల చేయాలని కోరుతూ నాగిరెడ్డిపేట ప్రజావాణిలో తహసీల్దార్ శ్రీనివాస్‌రావుకు రైతు నేత బొల్లు నర్సింహారెడ్డి, రైతులతో కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. ఆయకట్టు పరిధిలో ఇప్పటికే 95 శాతం వరినాట్లు పూర్తయ్యాయన్నారు. వర్షాలు సరిగ్గా కురవకపోవడం వల్ల పంటలు ఎండుముఖం పడుతున్నాయని చెప్పారు. పంటలను కాపాడుకునేందుకు నీటి విడుదల చేపట్టాలని కోరారు.ప్రాజెక్టులో సుమారు 500 మోటార్లను ఏర్పాటు చేసి నీటిని అక్రమంగా తోడేస్తున్నారని పేర్కొన్నారు.అలాగే రాంరెడ్డి చెరువు నీటిని రైతుల భూములకు అందించేందుకు పోచారం ప్రధానకాలువపై ఏర్పాటు చేసిన ధోనీలు పూర్తిగా శిథిలమై సాగునీరు వృథాగా కాలువలో ప్రవహిస్తుందన్నారు. అధికారులు స్పందించి ధోనీలకు మరమ్మతులు చేపట్టాలని కోరారు. మాజీ ఎంపీపీ రాజ్‌దాస్, మాజీ జెడ్పీటీసీ జయరాజ్, తదితరులున్నారు.

రోడ్డు ఇలా.. నడిచేది ఎలా ?



మోటారుపట్టాలొద్ది తండా వెళ్లే రోడ్డు

మాచారెడ్డి: మండలంలోని మోటారుపట్టాలొద్ది తండాకు వెళ్లే రోడ్డు బురదమయంగా మారడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. చినుకు పడితే చాలు ఈ రోడ్డంతా బురదమయంగా మారుతోంది. అలాగే రోడ్డు పక్కన వాగు పారుతుండటంతో ప్రతి పనికి ఆటంకం ఏర్పడుతోంది. గతంలో పాము కాటుకు గురైన వ్యక్తిని జేసీబీ సహాయంతో ఆస్పత్రికి తరలించారు. వెంటనే ఈ రోడ్డును బాగు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన



లింగంపేట(ఎల్లారెడ్డి): కొండాపూర్ తండాలో సోమవారం సీజనల్ వ్యాధులు రాకుండా వైద్య సిబ్బంది ముందు జాగ్రత్తగా గిరిజనులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తండాలో ఇంటింటికి తిరిగి వ్యాధులు సోకకుండా ఉండడానికి పలు జాగ్రత్తలు సూచించారు. జ్వరాలు, ఇతర సమస్యలు ఉన్న వారికి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. లార్వా, జ్వర సర్వే చేశారు. నీరు నిల్వ ఉన్న చోట మందులు పిచికారీ చేశారు. సబ్‌యూనిట్ అధికారి గోవింద్‌రెడ్డి, పీహెచ్‌సీ వైద్యులు రాంబాయి, సిబ్బంది పాల్గొన్నారు.

డ్రోన్ల వినియోగం.. అనివార్యం



కామారెడ్డి అర్బన్: యుద్ధ రంగం నుంచి వ్యవసాయ రంగం వరకు డ్రోన్‌ల వినియోగం అనివార్యంగా మారిందని కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ కె.విజయ్‌కుమార్ అన్నారు. సోమవారం కళాశాల టీఎస్‌కేసీ, బ్లూ రిబ్బన్ సంస్థల సౌజన్యంతో డ్రోన్ వినియోగంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. బ్లూ రిబ్బన్ సంస్థ ప్రతినిధులు డ్రోన్‌ను నడిపే విధానంపై విద్యార్థులకు ప్రయోగాత్మకంగా చూపించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు శ్రీనివాస్‌రావు, ఫర్హీన్ ఫాతిమా, టీఎస్‌కేసీ మెంటర్ అజారుద్దీన్, శ్రీలత, బ్లూ రిబ్బన్ ప్రతినిధులు శ్రీనివాస్‌రావు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

రామేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు

పిట్లం(జుక్కల్): మండల కేంద్రంలోని పురాతన శివాలయం- రామేశ్వర ఆలయంలో శ్రావణమాసం రెండో సోమవారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రావణ సోమవారం సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

కిటకిటలాడిన సిద్ధరామేశ్వరాలయం

భిక్కనూరు: భిక్కనూరు శ్రీసిద్ధరామేశ్వరాలయం సోమవారం భక్తులతో కిటకిటలాడింది. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పెద్దకొడప్‌గల్(జుక్కల్): మండల కేంద్రంలోని పాపహరేశ్వర ఆలయంలోప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ అవరణలో అన్నదానం నిర్వహించారు.

నిధులు వెచ్చించి.. నిరుపయోగంగా వదిలేసి



బొమ్మన్‌దేవ్‌పల్లిలోని వాటర్ ట్యాంకు

నస్రుల్లాబాద్: బొమ్మన్‌దేవ్‌పల్లిలో సింగిల్ ఫేజ్ బోరు మోటారు వద్ద గతంలో నీటి ట్యాంకును ఏర్పాటు చేశారు. ప్రభుత్వ నిధులు వెచ్చించి ఏర్పాటు చేసినా నిర్వహణ లేకపోవడంతో పైపులు పాడైపోయాయి. ప్రస్తుతం మోటారు నుంచి ట్యాంకులోకి వెళ్లే పైపులు పాడయ్యాయి. ట్యాంకు నుంచి కుళాయిల ద్వారా నీరు పట్టుకుందామంటే అవి తిరగడం లేదని స్థానికులు వాపోతున్నారు. ట్యాంకు పరిసరాలు కూడా పిచ్చి మొక్కలతో నిండిపోయింది. పంచాయతీ సిబ్బంది పట్టించుకోకపోవడంతో చుట్టు ప్రక్కల పరిసరాలు సైతం మురికిగా మారి దుర్వాసన వస్తోందని కాలనీ ప్రజలు అంటున్నారు. అధికారులు పట్టించుకొని ట్యాంకును ఉప యోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

మెట్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయండి



ఎమ్మెల్యేను సత్కరిస్తున్న నాగిరెడ్డిపేట గ్రామస్తులు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని నాగిరెడ్డిపేట గ్రామశివారులో గల పటేల్‌చెరువులో బతుకమ్మ మెట్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ గ్రామ కాంగ్రెస్ నాయకులు.. ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావుకు వినతిపత్రాన్ని అందజేశారు. హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే నివాసంలో సోమవారం వారు కలిశారు. ఈ సందర్భంగా గ్రామ శివారులోని పటేల్‌చెరువులో మెట్లు లేకపోవడం వల్ల బతుకమ్మ పండుగ సమయంలో మహిళలు ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యేకు వివరించారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత అధికారులతో మాట్లాడి నిర్మాణానికి నిధులు మంజూరయ్యేలా కృషి చేస్తానని తెలిపినట్లు వారు చెప్పారు. నాగిరెడ్డిపేట కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు సాయాగౌడ్, నాయకులు రాజు, కిషన్, రమేష్, మన్నె యాదగిరి తదితరులున్నారు.

ఎక్సైజ్‌శాఖ ఆధ్వర్యంలో వనమహోత్సవం



పోచారం ప్రాజెక్టు కట్టపై మొక్కలు నాటుతున్న అధికారులు



నస్రుల్లాబాద్‌లో .. ఎంఈవో చందర్

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): పోచారంప్రాజెక్టు వద్ద సోమవారం ఎక్సైజ్‌శాఖ ఆధ్వర్యంలో వనమహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్లారెడ్డి ఎక్సైజ్ సీఐ షాకీర్ అహ్మద్ ఆధ్వర్యంలో అధికారులు, గౌడకులస్తులు పోచారంప్రాజెక్టు కట్టపై ఈత, కజుర మొక్కలు నాటారు. నాగిరెడ్డిపేట ఏఎస్సై సుదర్శన్, పంచాయతీ కార్యదర్శి భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి రూరల్: దావల్ మల్కాపల్లిలో ఎక్సైజ్ శాఖ అధికారులు సోమవారం ఈత మొక్కలను నాటారు. ఎక్సైజ్ శాఖ సీఐ షాకీర్ అహ్మద్, ఈజీఎస్ ఏపీవో వినోద్, ఎక్సైజ్, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

నస్రుల్లాబాద్: మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో సోమవారం వనమహోత్సవం నిర్వహించారు. ఎంఈవో చందర్, ఉపాధ్యాయులు కిషన్‌లాల్, ఇందిర, ప్రసాద్, బాల్ రాజు తదితరులున్నారు.

సంక్షిప్తం

నూతన కార్యవర్గం ఎన్నిక



కామారెడ్డి టౌన్: కామారెడ్డి టిఫిన్ సెంటర్స్ ఓనర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని సోమవారం జిల్లా కేంద్రంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా పబ్బ శ్రీహరి, పట్టణ అధ్యక్షుడిగా గట్ల బాలరాజు (భాను), ప్రధాన కార్యదర్శిగా తలకుంట్ల మోహన్, కోశాధికారిగా పటేల్ రాజు, ఉపాధ్యక్షులుగా గౌరిశెట్టి శివకాంత్, షేక్ సాజిద్, ఉప కార్యదర్శులుగా ఉదయ్ శెట్టి, డి.శ్రీనివాస్, కార్యవర్గ సభ్యుడిగా గాదిగే అనిల్‌లను ఎన్నుకున్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

నిజాంసాగర్(జుక్కల్): మండలంలోని మాగి గ్రామానికి చెందిన పలువురికి సోమవారం కాంగ్రెస్ నాయకుడు గుర్రపు శ్రీనివాస్ పటేల్ చేతుల మీదుగా సీఎం సహాయనిధి చెక్కులను అందజేశారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సంఘాల బలోపేతానికి కృషి

బాన్సువాడ రూరల్: బాన్సువాడ ఏపీఎంగా పద్మ మండల సమాఖ్య పరిధిలో డ్వాక్రా సంఘాల బలోపేతానికి విశేష కృషి చేశారని సీసీలు, వీవోఏలు కొనియాడారు. పదేళ్లుగా బాన్సువాడ ఏపీఎంగా సేవలు అందించి బదిలీపై నస్రుల్లాబాద్‌కు వెళ్తున్న సందర్భంగా వీడ్కోలు సమావేశం నిర్వహించారు. బదిలీపై వెళ్తున్న ఏపీఎం పద్మతో పాటు బిచ్కుంద నుంచి బాన్సువాడకు బదిలీపై వచ్చిన ఏపీఎం నాగరాజులను సన్మానించారు.

ఏజెన్సీ కార్మికుల నిరసన

నిజాంసాగర్(జుక్కల్): జుక్కల్ తహసీల్ కార్యాలయం వద్ద సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో ఏజెన్సీ కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. వంట బిల్లులు, గౌరవ వేతనాలు చెల్లించాలని తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ జోన్ కన్వీనర్ సురేశ్‌గొండ తదితరులున్నారు.

స్తంభం పరిశీలన

ఎల్లారెడ్డి: పట్టణంలోని పెద్ద మసీదు వద్ద విద్యుత్ వైబ్రేషన్ వస్తున్న విద్యుత్ స్తంభాన్ని ఆ శాఖ డీఈ విజయసారథి సోమవారం పరిశీలించారు. ఆ స్తంభాన్ని తొలగించి సిమెంట్ స్తంభాన్ని ఏర్పాటు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఏఈ వెంకటస్వామి, తదితరులున్నారు.

తల్లిపాలే బిడ్డకు బలం



మద్నూర్(జుక్కల్): పిల్లల్లో రోగనిరోధక శక్తి పెంపొందించేందుకు తల్లిపాలు ఎంతో దోహదపడుతాయని ఐసీడీఎస్ సీడీపీవో కళావతి తెలిపారు. డోంగ్లీ మండలంలోని చిన్న టాక్లీ, మద్నూర్ మండలంలోని మేనూర్‌లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో సోమవారం నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు.